ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్టం 32.6 : కనిష్టం 20.8
5
కామారెడ్డి జిల్లా వార్తలు
బుధవారం 21 ఫిబ్రవరి 2024



23న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ సెలక్షన్స్

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 20: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఈనెల 23న హైదరాబాద్‌లోని కొల్లూర్‌లో గల గాడియం స్పోర్టిపియం స్కూల్ నందు జరగబోయే తెలంగాణ రాష్ట్రస్థాయి 400 మీటర్స్ చాంపియన్ షిప్ కోసం స్థానిక ఇందిరాగాంధీ స్టేడియంలో సెలక్షన్స్‌లు మంగళవారం నిర్వహించారు. అండర్ 14,16,18,20 మెన్ అండ్ ఉమెన్‌కు 400 మీటర్ల పరుగు పందెం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ తెలిపారు.





జహీరాబాద్‌లో.. గెలుపే లక్ష్యంగా!

- ఎంపీ ఎన్నికల్లో సత్తా చాటేందుకు సిద్ధమవుతున్న ప్రధాన పార్టీలు
- పోరుకు సిద్ధమవుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు
- విజయ సంకల్ప యాత్రతో బీజేపీ
- ఎలాగైన జహీరాబాద్‌పై జెండా ఎగురవేయాలని కాంగ్రెస్ పట్టు
- యువతను ఆకట్టుకునేందుకు కాంగ్రెస్ పలు కార్యక్రమాలు
- హ్యాట్రిక్ కొట్టేందుకు బీఆర్ఎస్ కసరత్తు
- సన్నాహక సమావేశాలను నిర్వహిస్తున్న బీఆర్ఎస్

కామారెడ్డి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ పార్లమెంట్ స్థానంపై కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ ప్రధాన పార్టీలు ఫోకస్ పెట్టాయి. ఈ లోక్‌సభ ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలో గట్టి పోటీ నెలకొంటుంది. దేశవ్యాప్తంగా మారుతున్న రాజకీయ సమీకరణాలకు అనుగుణంగా రాష్ట్రంలో మెజార్టీ పార్లమెంట్ సీట్లను సాధించేందుకు ప్రధాన పార్టీలు ప్రయత్నాలు మొదలుపెట్టాయి. జాతీయ స్థాయిలో ఈ పార్లమెంట్ ఎన్నికలు కీలకంగా మారడంతో మూడు పార్టీలకు చెందిన పలు వురు నేతలు ఆశావహులు తమ రాజకీయ భవిష్యత్తు కోసం ఇప్పటి నుంచే ప్రయత్నాలు మొదలుపెట్టారు. గత ఎన్నికలకు భిన్నంగా లోక్‌సభ ఎన్నికల్లో త్రిముఖ పోటీ నెలకొననున్నందున ప్రధాన మూడు పార్టీలు జహీరాబా ద్ నియోజకవర్గంలో గట్టిపోటీ ఇవ్వనున్నాయి. ఎలాగైనా జహీరాబాద్ స్థానాన్ని తమ ఖాతాలో వేసుకునేందుకు అన్ని పార్టీలు పావులు కదుపుతున్నాయి. వివిధ కార్యక్ర మాలతో ఇప్పటి నుంచే నియోజకవర్గంలో పట్టు సాధిం చేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి.

జహీరాబాద్‌లో జెండా ఎగురవేయాలని కాంగ్రెస్ పట్టు

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ జహీరాబాద్ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో జహీరాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలోని 7 అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ అన్ని పార్టీల కంటే ఎక్కువ ఓట్లు సాధించింది. ఏడుగురు అభ్యర్థులకు కలిపి సుమారు 5.60లక్షల ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ కంటే సుమారు 20 వేల ఓట్లు అధికంగా సాధించింది. ఇదే ఉత్సాహంతో పార్లమెంట్ ఎన్నికల్లో కూడా విజయం సాధించాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ సారి లోక్‌సభ ఎన్నికల్లో జహీరాబాద్‌పై కాంగ్రెస్ జెండా ఎగురవేసి పూర్వ వైభవాన్ని పొందేందుకు కసరత్తు చేస్తోంది. పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జీలను నియమించడంతో పాటు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ప్రధానంగా ఇద్దరు ముఖ్య నేతలు టికెట్ కోసం పోటీ పడుతున్నా రు. మా జీ ఎంపీ సురేష్ షెట్కార్, ఎన్ఆర్ఐ ఉజ్వల్‌రెడ్డిలు టికెట్ ఆశిస్తున్నారు. వీరు ఇరువురు ఇప్పటికే పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఎవరికి వారే పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఇరువురు నేతలు పోటాపోటీగా కటౌట్‌లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తూ పోటీల్లో ఉన్నామని ప్రచారం చేసుకుంటున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే సీఎం రేవంత్‌రెడ్డి జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా సురేష్ షెట్కార్ ఉంటారని ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో సురేష్ షెట్కార్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పలు హెల్త్ క్యాంపులు నిర్వహిస్తూ వస్తున్నారు. అదేవిధంగా ఉజ్వల్‌రెడ్డి యువత ఓట్లను ఆకర్షించేందుకు పలు క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



విజయసంకల్ప యాత్రతో బీజేపీ

కొన్ని నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయమైన బీజేపీ ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో ఎలాగైనా సత్తా చాటాలని చూస్తోంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలకు భిన్నంగా పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు ఉంటాయనే ధీమాతో బీజేపీ ఉంది. జహీరాబాద్ స్థానంతో కాషాయపు జెండాను ఎగురవే యాలని ఆ పార్టీ అధిష్ఠానం భావిస్తోంది. ఇందులో భాగంగా బీజేపీ విజయ సంకల్ప యాత్ర పేరిట బస్సు యాత్రను నిర్వహించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఐదు క్లస్టర్‌లను విభజించి బస్సు యాత్ర చేపట్టనున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలను కలుపుతూ బస్సుయాత్రకు శ్రీకారం చుట్టారు. కేంద్రమంత్రి బీఎల్ వర్మ జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో విజయసంకల్ప యాత్ర నిర్వహించనున్నారు. ఇప్పటికే మండలాల వారీగా ముఖ్య కార్యకర్తల సమావేశాలను నియోజకవర్గ ఇన్‌చార్జ్ కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి నిర్వహిస్తూ వచ్చారు. జహీరాబాద్, ఆంథోల్, నారాయణఖేడ్, కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించారు. ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. మరోవైపు కేంద్ర పథకాల గురించి వివరించేందుకు ప్రచార రథాలు ఏర్పాటు చేసి అన్ని గ్రామాల్లో తిప్పుతున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌తో పోలిస్తే క్యాడర్ బీజేపీకి తక్కువే అయినప్పటికీ ఉన్న దానితోనే ఎన్నికలను ఎదుర్కోవాలని చూస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని 7 అసెంబ్లీ స్థానాల్లో కేవలం 1.71లక్షల ఓట్లు మాత్రమే వచ్చాయి. అయితే లోక్‌సభ ఎన్నికల విషయానికి వస్తే పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉంటాయని బీజేపీ భావిస్తోంది.

హ్యాట్రిక్ కోసం బీఆర్ఎస్ ప్రయత్నాలు

సిట్టింగ్ పార్లమెంట్ స్థానం జహీరాబాద్‌పై మరోసారి బీఆర్ఎస్ జెండాను ఎగురు వేసేందుకు ఆ పార్టీ సిద్ధమవుతోంది. ఇక్కడ రెండు పర్యాయాలు విజయం సాధించిన బీఆర్ఎస్ హ్యాట్రిక్ కొట్టాలని చూస్తోంది. రాష్ట్రంలో అధికారం కోల్పోయి నిరుత్సాహంలో ఉన్న గులాబీ క్యాడర్‌లో జోష్ నింపే ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే పార్లమెంట్ స్థాయిలో ముఖ్యనేతలతో హైదరాబాద్‌లో సన్నాహక సమావేశాలు నిర్వహించిన ఆ పార్టీ ఇకపై అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో పార్టీ క్యాడర్‌తో సమావేశాలు నిర్వహించాలని భావిస్తోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని బాన్సువాడ అసెంబ్లీ స్థానంపై విజయం సాధించిన విషయం తెలిసిందే. మరోవైపు పార్లమెంట్ స్థానం పరిధిలో 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ 5.30లక్షల ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచింది. లోక్‌సభ ఎన్నికల్లోనూ సత్తా చాటేందుకు పావులు కదుపుతోంది.

యథేచ్ఛగా మొరం తవ్వకాలు

- జిల్లాలో అక్రమంగా తరలిపోతున్న మొరం
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- పట్టించుకోని జిల్లా అధికారులు

తాడ్వాయి, ఫిబ్రవరి 20: జిల్లాలో మొరం దందా అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. ప్రభుత్వ పట్టా భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరుపుతున్నారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా అడ్డంగా మొరం తవ్వకాలు నిర్వహిస్తున్నారు. ఇలా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం సైతం గండి కొడుతున్నారు. ప్రైవేట్, ప్రభుత్వ భూములు అని తేడా లేకుండా అక్రమంగా మొరం తవ్వకాలు చేపడుతూ అక్రమార్కులు లక్షలు గడిస్తున్నారు. తాడ్వాయి మండలంలో ఈ దందా జోరుగా కొనసాగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే వాదనలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

తాడ్వాయిలో యథేచ్ఛగా దందా

తాడ్వాయి మండలంలో అక్రమ మొరం తవ్వకాలు పెరిగిపోతున్నాయి. మండలంలోని దేమికలాన్ శివారులో, తాడ్వాయి మండల కేంద్ర శివారులో, కన్కల్ గ్రామాల శివారులో మొరం తవ్వకాలు మితిమీరిపోయాయి. అడ్డూ అదుపు లేకుండా కొందరు నాయకులు అక్రమంగా మొరం దందా చేపడుతూ అక్రమ సంపాదనకు తెర దీస్తున్నారు. మొరం తవ్వకాలను నిరోధించాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో ఉంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమంగా తరలిపోతు న్న మొరాన్ని నిరోధించాల్సిన రెవెన్యూ అధికారులు, పోలీసులు తమకు ఏమి పట్టనట్లుగా వ్యవహరించడంతో మొరం తవ్వకాలు ఊపందుకుంటున్నాయి. మండలంలోని కొందరు రాజకీయ నాయకులు ఇదే పనిగా పెట్టుకుని అక్రమ దందాకు పాల్పడుతున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో శబరి మాత ఆశ్రమం పక్కనే ఉన్న పెద్దపెద్ద గుట్టలు అక్రమ మొరం దందాలతో విశాలమైన గుట్టలు నేలమట్టమయ్యాయి. ప్రస్తుతం చందాపూర్ రోడ్డు పక్కనే ఉన్న గుట్టను తవ్వేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులకు అంతా తెలిసినా అటువైపు కన్నెత్తి చూడడం లేదు. అక్రమ మొరం దందాను నిలిపివేయాలని ప్రజలు పలుమార్లు అధికారులను వేడుకున్నా పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు.



తాడ్వాయిలో మొరం తవ్వుతున్న దృశ్యం

ప్రభుత్వ ఆదాయానికి గండి

అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా మొరాన్ని తరలించడంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. సదరు వ్యాపారులు మొరాన్ని తరలించాలంటే గ్రానైట్, కంకర క్వారీల మాదిరిగానే భూగర్భ గనుల, రెవెన్యూ శాఖల నుంచి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయా శాఖల వారు తవ్వకాల అనుమతులు ఇస్తారు. ఒక్కో క్యూబిక్ మీటర్‌కు రూ.30 రాయల్టీ చెల్లించాలి. కానీ ఎక్కడ ఈ నిబంధనలు పాటించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే అక్రమ మొరం దందాను నిలిపివేయాలని ప్రజలు కోరుతున్నారు.

5వ విడత యాసంగి పంటలకు నీటి విడుదల

నిజాంసాగర్, ఫిబ్రవరి 20: నిజాంసాగర్ ఆయకట్టుకు ప్రధాన కాల్వ ద్వారా 5వ విడత నీటి విడుదల యాసంగి పంటల కోసం మంగళవారం ఉదయం ప్రారంభించినట్లు నీటి పారుదల శాఖ ఏఈ శివ ప్రసాద్ తెలిపారు. 1800 క్యూసెక్కుల నీరు ప్రధాన కాల్వ ద్వారా విడుదల చేసి నట్లు పేర్కొన్నారు. ఆయకట్టు కింద లక్షా 25వేల ఎకరాల భూమి సాగ వుతుండగా, ఇప్పటి వరకు 4 విడతల్లో నీరు విడుదల చేసినట్లు తెలి పారు. ఆయకట్టు పంటలు గట్టెక్కేందుకు 7 విడతల్లో 11 టీఎంసీల నీరు అవసరముంటుందన్నారు. రైతుల అవసరాలకు అనుగుణంగా నీటి విడుదలో మార్పులుండవచ్చన్నారు. రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. 1405 అడుగులకు గాను 1398.60 అడుగులు, 17.802 టీఎంసీలకు గాను 9.91 టీఎంసీల నీరు ప్రాజెక్టులో నిల్వ ఉందన్నారు.



ప్రధాన కాల్వ ద్వారా విడుదలవుతున్న నీరు

భిక్కనూరులో డివైడర్ మూసివేత పనుల అడ్డగింత

భిక్కనూరు, ఫిబ్రవరి 20: మండల కేంద్రంలోని చర్చి చౌరస్తా వద్ద 44వ జాతీయ రహదారిపై నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు మంగళవారం చేపట్టిన డివైడర్ మూసివేత పనులను భిక్కనూరు యువకులు, బజరంగ్‌దళ్ ప్రతినిధులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ఈ డివైడర్‌ను మూసి వేయడంతో గ్రామ ప్రజలు, ముఖ్యంగా కళాశాలలకు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఎన్‌హెచ్ఏఐ అధికారులు వెంటనే జంక్షన్ బ్రిడ్జి వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బజరంగ్‌దళ్ ప్రతినిధులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



డివైడర్ మూసివేత పనులను అడ్డుకుంటున్న స్థానికులు

ఉపాధి హామీ పనుల్లో నాణ్యత పాటించాలి

రామారెడ్డి, ఫిబ్రవరి 20: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఉపాధి హామీ పథకం పనుల్లో ఎలాంటి అక్రమాలు లేకుండా పనులను సక్రమంగా నిర్వహించాలని రామారెడ్డి ఇన్‌చార్జ్ ఎంపీడీవో సవిత పేర్కొన్నారు. మంగళవారం రామారెడ్డి మండలం సింగరాయిపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులను, నర్సరీలో మొక్కలను పరిశీలించారు. కూలీలతో మాట్లాడి కొలతల ప్రకారం వర్క్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో ధర్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శి బాల్‌రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

కాల భైరవ స్వామి ఆలయంలో సింధూర పూజలు



స్వామి వారిని అలంకరించిన దృశ్యం

రామారెడ్డి, ఫిబ్రవరి 20: రామారెడ్డి మండలం ఇస్సన్నపల్లి - రామారెడ్డి గ్రామాల మధ్య వెలసిన కాల భైరవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం స్వామి పర్వదినం కావడంతో పురోహితులు శ్రీనివాస్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య భైరవునికి క్షీరాభిషేకం, సింధూర పూజలు, అర్చనలు, హారతి వంటి పూజ కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం స్వామి వారి సన్నిధానంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. స్వామి వారి దర్శనం కోసం కామారెడ్డి జిల్లా నుంచే కాకుండా నిజామాబాద్, ఆదిలాబాద్, పక్క రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటకల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రభు రాంచంద్రం గుప్తా, జూనియర్ అసిస్టెంట్ సురేందర్‌గుప్తా, మాజీ ధర్మకర్తలు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు



పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 20: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను విడుదల చేయాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ చరణ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక పోకడలతో ముందుకు సాగిందని ఈ ప్రభుత్వమైనా విద్యార్థుల పక్షాన ఉంటుందంటే విద్యార్థి వ్యతిరేక విధానాలతో ముందుకు వెళ్తుందని అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చి మూడు నెలలు అయినా ఇంత వరకు ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు గురవుతున్నారని తెలిపారు. డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులు వాళ్ల ఉన్నత చదువులకు పోవాలంటే సర్టిఫికెట్లు అవసరం ఉంటుందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ రాక సర్టిఫికెట్స్ కళాశాల యాజమాన్యాలు ఇవ్వకపోవడంతో విద్యకు దూరమవుతున్నారని అన్నారు. ఇకనైనా స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ రిలీజ్ చేయకపోతే పెద్ద ఎత్తున మంత్రులు, ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల వద్ద నిరసన తెలుపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా హాస్టల్ కన్వీనర్ ఖలీల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రత్యూష, రోహిత్, సంజయ్, కార్యకర్తలు వెంకటేష్, నవీన్, చరిత్, చందు, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

జన జాతరకు వేళాయె..

నేటి నుంచి మేడారం కుంభమేళా ప్రారంభం

▸▸ నేడు గద్దెకు చేరుకోనున్న సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు ▸▸ నాలుగు రోజుల పాటు పూజలందుకోనున్న వనదేవతలు


మేడారం జాతరకు తరలివస్తున్న భక్తులు

వరంగల్, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడారం జనారణ్యం అవుతోంది. వనదేవతల ఆగమనానికి వేళవుతుండటంతో భక్తులతో మేడారం పోటెత్తుతోంది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న అద్భుత క్షణాలు బుధవారం సాక్షాత్కరించనున్నాయి. తొలిరోజు సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెకు చేరుకుంటారు. ఈ నేపథ్యంలో మేడారం జనగుడారమవుతోంది. ఎడ్లబండ్లు, కాలి నడకన, కార్లు, ఆటోలు, జీపులు, బస్సుల్లో భక్తులు మేడారం చేరుకుంటున్నారు.

నేటి నుంచి జాతర

తెలంగాణ కుంభమేళాగా పిలిచే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర బుధవారం నుంచి ప్రారంభం కానుంది. రెండేళ్లకోసారి మాఘశుద్ధ పౌర్ణమిన రోజైన బుధవారం నుంచి శనివారం వరకు నాలుగు రోజుల పాటు ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని దట్టమైన అరణ్యంలోని మేడారంలో జరిగే ఈ మహాజాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగున ఉన్న ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. పూర్తిగా ఆదివాసీ సంప్రదాయ పద్ధతిలో జరిగే ఈ జాతరలో ప్రకృతే దైవంగా.. వనదేవతల స్మారకార్థం నిర్మించిన కర్రల వద్దే పూజలు నిర్వహిస్తారు. వనదేవతలకు పసుపు, కుంకుమ, ఒడి బియ్యం, ఎదుర్కోళ్ల తో పాటు బంగారాన్ని (బెల్లం) మొక్కుగా చెల్లిస్తారు.

గద్దెపైకి చేరిన జంపన్న

జాతర నేపథ్యంలో సమ్మక్క తనయుడు జంపన్న కన్నెపల్లి నుంచి మంగళవారం రాత్రి 8గంటలకు జంపన్న వాగు ఒడ్డునున్న గద్దెకు చేరుకున్నారు. పోలెబోయిన వంశీయులు పూజారి సత్యం ఆధ్వర్యంలో పగిడె రూపంలో ఉన్న జంపన్నను గద్దెపై కొలువుదీర్చి పూజలు చేశారు.

నేడు గద్దెకు చేరనున్న సారలమ్మ

జాతర తొలిరోజున కన్నెపల్లి ఆడపడుచు సారలమ్మ గద్దెపైకి రానుంది. సారలమ్మ కొలువైన పల్లె కన్నెపల్లిలో బుధవారం ఉదయమే ప్రధాన పూజారి కాక సారయ్య ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సారయ్యతోపాటు మిగతా పూజారులు ఆలయాన్ని శుద్ధి చేసి అలికి ముగ్గులతో అలంకరిస్తారు. సాయంత్రం ఆలయంలో ఆదివాసీ పూజారులు రహస్య పూజలు జరుపుతారు. ఈ సమయంలోనే పూజారి సారయ్యను సారలమ్మ ఆవహిస్తుంది. సారయ్యకు పూనకం రావడంతో ఆలయం నుంచి గద్దెల వైపు పూజారులు సారలమ్మను తీసుకవస్తారు. కన్నెపల్లి మీదుగా తన తమ్ముడు జంపన్నను పలకరిస్తూ జంపన్నవాగును పూజారులు దాటుతారు. ఈ సమయంలోనే శివసత్తుల పూనకాలతో భక్తుల పుణ్యస్నానాలతో జంపన్నవాగు పులకరిస్తుంది. కన్నెపల్లి నుంచి మేడారంలో ఉన్న సమ్మక్క ఆలయానికి సారలమ్మ చేరుకుంటుంది.


సమ్మక్క గద్దె


సారలమ్మ గద్దె


వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

పగిడిద్దరాజు, గోవిందరాజుల రాక

మంగళవారం మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల నుంచి సమ్మక్క భర్త పగిడిద్దరాజు మేడారం బయలుదేరారు. ఆదివాసీలు కాలినడకన పగిడిద్దరాజును పడిగె రూపంలో తీసుకుని బుధవారం సాయంత్రానికి మేడారంలోని సమ్మక్క గుడికి చేరుకుంటారు. ఇక పగిడిద్దరాజు తమ్ముడు గోవిందరాజులు కూడా బుధవారమే ఏటూరునాగారం మండలం కొండాయి నుంచి బయలుదేరి, మేడారం చేరుకుంటారు. సమ్మక్క ఆలయంలో ముగ్గురికి ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం రాత్రి 8గంటలకల్లా మేడారంలోని గద్దెలపైకి చేరుకుంటారు. దీంతో తొలిరోజు జాతర అట్టహాసంగా ప్రారంభం అవుతుంది.

23న మొక్కులు

జాతరలో మూడోరోజు శుక్రవారం గద్దెలపై సమ్మక్క, సారలమ్మల తోపాటు పగిడిద్దరాజు, గోవిందరాజులు చేరుకోవటంతో భక్తులు రాత్రి పగలు తేడా లేకుండా మొక్కులు చెల్లించేందుకు బారులు తీరుతారు. 23వ తేదీ శుక్రవారం వనదేవతలకు మొక్కులు చెల్లింపులు చేస్తారు. తీరొక్క మొక్కులతో వనదేవతలను శరణ కోరుతారు.

22న సమ్మక్క ఆగమనం

జాతరలో రెండోరోజైన గురువారం 22న మేడారంలోని చిలుకలగుట్టపై రహస్య ప్రాంతంలో సమ్మక్క ప్రధాన పూజారి కొక్కెర కిష్టయ్యతో పాటు వడ్డెలు మునిందర్, బొక్కయ్య ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం కుంకుమ భరిణె రూపంలో ఉన్న సమ్మక్కను తీసుకుని ప్రధాన పూజారి కిష్టయ్య చిలుకలగుట్టపై నుంచి కిందకు వస్తున్న క్రమంలో ములుగు ఎస్పీ గాలిలోకి కాల్పులు జరిపి సమ్మక్క రాకను స్వాగతిస్తారు. ఆ సమయంలో కోట్లాది భక్తుల జయజయ నినాదాలతో మేడారం హోరెత్తుతుంది. సమ్మక్క ఆగమనంతో దారి పొడవునా వేలాది మేకలు, గొర్రెలు, కోళ్ల తలలు తెగి రక్తం చిందిస్తాయి. పూజారులు అత్యంత భక్తిశ్రద్ధలతో రాత్రి 10గంటల కల్లా సమ్మక్క గద్దెకు చేరుకోవటంతో మహాజాతర తుది ఘట్టానికి చేరుకుంటుంది.

24న వనప్రవేశం

జాతరలో చివరి రోజైన నాలుగో రోజు శనివారం సాయంత్రం 6గంటలకు సమ్మక్క తిరిగి చిలుకలగుట్టకు తిరుగు ప్రయాణం అవుతుంది. సమ్మక్క వన ప్రవేశంతో సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు కూడా వారి స్వగ్రామాలకు పయనం అవుతారు. దీంతో జాతర ముగుస్తుంది.


కన్నెపల్లి నుంచి జంపన్నను గద్దెపైకి తీసుకొచ్చి ప్రతిష్ఠిస్తున్న వడ్డెలు


మేడారం దారిలో వాహనాల బారులు..


మంగపేట మండలం కమలాపురం నుంచి ఎడ్లబండ్లపై జాతర కొస్తున్న భక్తులు



నాగిరెడ్డిపేటలో ఎంపీటీసీల నిరసన

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 20:ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం జరిగిన కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ప్రోటోకాల్ పాటించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ మండల ఎంపీటీసీ సభ్యులు తీవ్ర నిరసనలు వ్యక్తంచేశారు.చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ముగించుకుని ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు వెళ్లిన అనంతరం మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీపీ చాంబర్‌లో ఎంపీపీ రాజ్‌దాస్, స్థానిక తహసీల్దార్ లక్ష్మణ్‌ల ఎదుట తమకు జరిగిన అన్యాయం గురించి కార్యక్రమంలో ప్రోటోకాల్ పాటించక పోవడం గురించి ఎంపీటీసీలు మొర పెడుతూ వాగ్వాదానికి దిగారు. దీంతో తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీటీసీలకు క్షమాపణ చెప్పారు.

పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

బోధన్ రూరల్, ఫిబ్రవరి 20: మార్చి 3వ తేదీ నుంచి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని బోధన్ ఆర్డీవో రాజాగౌడ్ అన్నారు. మంగళవారం బోధన్ ఆర్డీవో కార్యాలయంలో డివిజన్ స్థాయి వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోధన్‌లో సుమారు 38 వేల మంది 5 సంవత్సరాల లోపు పిల్లలు ఉన్నా రని పేర్కొన్నారు. పల్స్ పోలియో చుక్కలు పిల్లలందరికీ వేసేలా వైద్య సిబ్బం ది పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. బోధన్ డివిజన్‌లో 256 పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొ న్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో డాక్టర్ విద్య, మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణతో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

కోటగిరి,ఫిబ్రవరి20: కోటగిరి మండల కేంద్రంలో సోమవారం రాత్రి పేకాట స్థావరంపై దాడి చేసి ముగ్గురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. పేకాట కేంద్రం వద్ద రూ.12,300 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బోరు మోటార్లు బీఆర్ఎస్ నేతలు తీసుకెళ్లారు

● తమ ఇళ్లల్లో బిగించుకుని వాడుకుంటున్నారు
● డీఎల్‌పీవో నాగరాజ్‌కు కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు

బీర్కూర్, ఫిబ్రవరి 20: బీర్కూర్‌లోని ఆయా కాలనీల్లో ప్రజల దాహార్తిని తీర్చేందు కోసం ఏర్పాటు చేసిన బోరు మోటార్లను కొంత మంది బీఆర్ఎస్ పార్టీకి చెందిన నేతలు తీసుకుపోయి తమ ఇళ్లల్లో బిగించుకుని వాడుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు డీఎల్‌పీవో నాగరాజ్‌కు ఫిర్యాదు చేశారు. మంగళవారం డీఎల్‌పీవో నాగరాజ్ బీర్కూర్‌కు విచ్చేసి, జీపీనితనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఇదిలా ఉండగా కాంగ్రెస్ పార్టీ నాయకులు డీఎల్‌పీవోను కలిసి స్థానిక సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.తాగునీటి ట్యాంకులను నింపే పైప్‌లైన్ల నుంచి కొందరు నాయకులు తమ ఇళ్లకు నేరుగా కనెక్షన్ తీసుకున్నారని చెప్పారు.వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డీఎల్‌పీవోను కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో కాంగ్రెస్ నాయకులు బస్వరాజ్, చందు, కార్యకర్తలు ఉన్నారు.

బోధన్ మున్సిపల్ డీఈ బదిలీ

బోధన్‌రూరల్, ఫిబ్రవరి 20: బోధన్ మున్సిపల్ డీఈగా విధులు నిర్వహించిన శివానందం కామారెడ్డి మున్సిపాలిటీ డీఈగా బదిలీపై వెళ్లారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో డీఈగా విధులు నిర్వహించిన సుదర్శన్‌రెడ్డి బోధన్ మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు.

కమ్మర్‌పల్లిలో బ్రహ్మంగారి జాతర ఉత్సవాలు

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 20: కమ్మర్‌పల్లి శ్రీగిరి గుట్టపై కొలువుదీరిన కాలజ్ఞాని శ్రీమద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి జాతరా ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి.ఈసందర్భంగా స్వామివారి పల్లకీని స్థానిక లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి గ్రామకమిటీ సభ్యులు గుట్టపైకి చేర్చారు.మంగళవాద్యాలతో పల్లకీ ఊరేగింపు నిర్వహించారు.ఈనెల 24న స్వామివారి కల్యాణం, రథోత్సవ కార్యక్రమాలతోపాటు అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మల్లయ్య యాదవ్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.పల్లకి ఊరేగింపులో వీడీసీ సభ్యులు,ఆలయఅర్చకులు,కోశాధికారి పాలకవర్గసభ్యులు తదితరులు పాల్గొన్నారు

కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటా

పిట్లం, ఫిబ్రవరి 20: నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలకు, నాయకులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి అండగా ఉంటానని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావ్ అన్నారు. మండలంలోని కిష్టాపూర్, కిష్టాపూర్ తండా గ్రామాలలో కాంగ్రెస్‌పార్టీ విజయోత్సవ సభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జుక్కల్ ఎమ్మెల్యే తోటలక్ష్మీ కాంతరావ్ పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికి శాలువా, పూలమాలలతో సన్మానం చేశారు. ఈకార్యక్రమంలో అడ్వకేట్ రాంరెడ్డి, మురళీధర్ గౌడ్,బొడ్లరాజు, సుధాకర్, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సిరికొండ విద్యార్థులకు ఒలంపియాడ్ అవార్డులు

సిరికొండ ఫిబ్రవరి 20: వీరామానుజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన సైన్స్, గణితం ఒలంపియాడ్ పోటీ పరీక్షలో సిరికొండ సత్యాశోధక్ పాఠశాల విద్యార్థులు విజయభేరి మోగించారు.విజేతలైన విద్యార్థులకు హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ బహుమతి ప్రదానం చేశారు.తెలంగాణ ఆదాయ పన్నులశాఖ కమిషనర్ జీవన్‌లాల్,ట్రస్మ రాష్ట్రఅధ్యక్షుడు మధుసూదన్ పాల్గొన్నారు.జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ ఇలాంటి ఒలంపియాడ్ పోటీ పరీక్షల్లో పాల్గొనడం వల్ల విషయపరిజ్ఞానం,జనరల్‌నాలెడ్జ్,సామాజిక అంశాలపై అవగాహన ఉండాలన్నారు.

మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలి

సాలూర,ఫిబ్రవరి 20: సాలూర మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ విద్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని రికార్డులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు.


బీర్కూర్ మీ సేవ కేంద్రంలో రైతులకు ఈకేవైసీ చేయిస్తున్న దృశ్యం

ప్రతీ రైతు ఈకేవైసీ చేయించుకోవాలి

బీర్కూర్, ఫిబ్రవరి 20: పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి అర్హులు కావాలంటే ప్రతీ రైతు తప్పని సరిగా ఈ కేవైసీ చేయించుకోవాలని ఏఈవో శ్రావణ్ కుమార్ సూచించారు. మంగళవారం బీర్కూర్ మండల కేంద్రంలోని మీ సేవ కేంద్రంలో రైతులకు ఈకేవైసీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని నెలల క్రితం రైతులందరికీ ఈకేవైసీ చేయించామన్నారు. అయితే కొంత మంది రైతులు కొన్ని కారణాల వల్ల ఈకేవైసీ చేయించుకోలేదన్నారు. దీంతో వారికి పీఎం కిసాన్ పథకం ద్వారా డబ్బులు వచ్చే అవకాశాన్ని కోల్పోయారని అన్నారు. వారిని గుర్తించి మీసేవ కేంద్రంలో ఈ కేవైసీ చేయిస్తున్నామని తెలిపారు. సర్వర్ డౌన్ కావడం వల్ల బుధవారం చేయిస్తున్నట్లు తెలిపారు.

కళాశాలల్లో వీడ్కోలు సంబరాలు

బీర్కూర్, ఫిబ్రవరి 20: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులు వీడ్కోలు సంబరాలను జరుపుకున్నారు. సంబరాల్లో భాగంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు జూనియర్ విద్యార్థులు వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మాచారెడ్డి: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింగ్‌రావు ట్రస్ట్ ద్వారా కళాశాలలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ నర్సింగ్‌రావు మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులందరూ మంచిగా చదివి ఉన్నతంగా అభివృద్ధి చెందాలని పిల్లలకు పలు సూచనలు చేశారు. కళాశాల ఆవరణలో షెడ్డు నిర్మాణానికి ఒక లక్ష 30 వేలు అందజేసి, సత్వరమే పనులు ప్రారంభించి షెడ్డు పూర్తి చేయాలని సూచించారు. కళాశాలలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి షేక్ సలాం, ప్రిన్సిపాల్ బుద్ధి రాజు, అధ్యాపక బృందం, సీడీసీ చైర్మన్ రాజమౌళి గుప్త, మండల ఎంపీడీవో గోపిబాబు, ఎంపీవో నాగరాజు, దోమకొండ ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి, ఎంపీటీసీ రావుల వినోద, ప్రభాకర్, తాజా మాజీ సర్పంచ్ అంబటి లలిత తదితరులు పాల్గొన్నారు.

అప్పు ఇవ్వలేదని మహిళపై దాడి

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 20: వెయ్యి రూపాయలు అప్పు ఇవ్వలేదని ఓ మహిళపై భార్యాభర్తలు దాడి చేసినట్లు ఎల్లారెడ్డి ఎస్ఐ బొజ్జ మహేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన అమాన బేగం అనే మహిళ వద్ద అదే కాలానికి చెందిన కటికే పన్నా అనే మహిళ కొన్ని రోజుల క్రితం రూ.500 అప్పు తీసుకుని చెల్లించారు. తిరిగి మరోసారి వెయ్యి రూపాయలు అడుగగా ఇవ్వకపోవడంతో ఈ విషయాన్ని మనసులో పెట్టుకుని అమాన బేగం అనే మహిళపై కటికే పన్నా ఆమె భర్త అయ్యూబ్ ఇద్దరు దాడి చేశారు. మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బస్సు కిందపడి యువకుడి మృతి

బాన్సువాడ, ఫిబ్రవరి 20: ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సు కింద పడి యువకుడు మృతి చెందిన ఘటన బాన్సువాడ పట్టణంలో చోటు చేసుకుంది. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక రాజీవ్‌గాంధీ చౌరస్తా వద్ద బైక్‌పై వెళ్తున్న పిట్లం మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన సుమన్ బస్సును గమనించకుండా యూటర్న్ తీసుకుంటుండగా ప్రమాదవశాత్తు బస్సుటైరు కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో యువకుడు ముస్తాఫా గాయాలపాలయ్యాడు. క్షతగాత్రున్ని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 20: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఎన్‌జీవోస్ కాలనీకి చెందిన కేసీరెడ్డి నరసింహారెడ్డి కనిపించకుండా పోయాడని పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 17న సాయంత్రం 5.30 గంటలకు ఇంట్లో నుంచి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయాడని గత కొంతకాలంగా ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాడని తెలిపారు. చాలా మందికి డబ్బులు కూడా ఇచ్చేది ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. అతని భార్య సమత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఒక కాలికి పోలియో ఉండటం వల్ల కుంటినట్లుగా నడుస్తాడని, ఇతని చేతిలో ఒక స్టిక్ పట్టుకుని కూడా ఉంటాడని తెలిపారు. ఇతని ఆచూకీ తెలిసిన ఎవరైన కూడా పోలీసుస్టేషన్‌లో తెలియజేయాలని సూచించారు.

రేపు మద్నూర్‌లో శివాజీ జయంతి

మద్నూర్, ఫిబ్రవరి 20: మండల కేంద్రంలో ప్రతీ యేడాది నిర్వహించే ఛత్రపతి శివాజీ జయంతిని గురువారం నిర్వహించనున్నట్లు సార్వజనిక శివ జన్మోత్సవ సమితి నిర్వాహకులు వెల్లడించారు. జయంతి ఉత్సవాలకు భారీగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. మండల కేంద్రంలో ఉదయం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి, సాయంత్రం చిత్ర పటంతో శోభాయాత్ర నిర్వహిస్తామన్నారు. 19న జయంతి ఉన్నప్పటికీ ప్రతీ ఏడాది 22న నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

రోగులకు నాణ్యమైన సేవలు అందించాలి

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు


ఎల్లారెడ్డిలో ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డి/తాడ్వాయి/నాగిరెడ్డిపేట/గాంధారి, ఫిబ్రవరి 20: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు మంగళవారం ఉదయం తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు వైద్యులు అందుబాటులో ఉండి నాణ్యమైన వైద్యసేవలు అందించాలని విధుల పట్ల నిర్లక్ష్యం వ్యవహరించే వారిని ఉపేక్షించేది లేదని ఆయన అన్నారు. ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్య పోస్టులను భర్తీ చేయాలని డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్‌కు ఫోన్ చేసి ఆదేశించారు. అనంతరం ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ రవీంద్ర మోహన్, ఆర్డీవో ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చెన్న లక్ష్మణ్, గయాజుద్దీన్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చింతల శంకర్, కురుమ సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ కుటుంబానికి తాగు నీరు అందించాలి

గ్రామాల్లో ప్రతీ ఇంటికి తాగునీరు అందించాలని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మిషన్ భగీరథ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే వేసవి సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ రోజు ప్రతీ ఇంటికి తాగునీరు అందించడానికి కృషి చేయాలన్నారు. నిర్లక్ష్యం చేసే అధికారులపై వేటు తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ వినోద్, తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డి, తాడ్వాయి, నాగిరెడ్డిపేట, గాంధారి మండలాల్లో ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో అన్ని వర్గాల వారికి న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మన్నె ప్రభాకర్, జడ్పీటీసీ ఉషాగౌడ్, నాయకులు గయాజుద్దీన్, అజార్ ఖాద్రి, సాయిబాబా, గోపి కృష్ణ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి పలువురి చేరిక

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సమక్షంలో నాగిరెడ్డిపేట మండలంలోని తాండూరు గ్రామ తాజా మాజీ సర్పంచ్ సంగమేశ్వర్, దేవునిపల్లికి చెందిన నాగం సాయిబాబా, కళ్యాణి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు సంజీవులు, ఇంత్యాస్ తదితరులు బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి రూ.160కోట్లు మంజూరు

లింగంపేట: ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి మూడు నెలల్లో రూ.160కోట్లు మంజూరు చేశానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ అన్నారు. ఆయన మంగళవారం లింగంపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మహిళలకు 127 మందికి కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వెనుకబడిన ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు ఇక్కడి సమస్యలను అసెంబ్లీలో మాట్లాడి సమస్యలన్నీ పరిష్కరిస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గరీబున్నీసా, జడ్పీటీసీ శ్రీలత, ఎంపీటీసీ షమీమున్నీసా, తహసీల్దార్ ఖాలీచరణ్, డీటీ రాజేష్, నాయకులు బుర్ర నారాగౌడ్, సంతోష్‌రెడ్డి, ఎల్లమయ్య, మోహీద్, రఫీక్, జక్సాని రవి తదితరులు పాల్గొన్నారు.


భిక్కనూరులో రికార్డులను పరిశీలిస్తున్న దృశ్యం

ప్రభుత్వ ఆసుప్రతిలో కాన్పుల సంఖ్యను పెంచాలి

- ఎంసీహెచ్ పోగ్రాం అధికారిణి డాక్టర్ శోభారాణి

భిక్కనూరు, ఫిబ్రవరి 20: భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాన్పుల సంఖ్యను పెంచాలని ఎంసీహెచ్ ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ శోభారాణి సూచించారు. మంగళవారం భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పు చేసుకునేలా గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. అనేమియా ముక్త్ భారత్, అమ్మ ఒడి తదితర కార్యక్రమాలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి హేమిమా, విస్తీర్ణ అధికారి వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన నలుగురిపై కేసు నమోదు

తాడ్వాయి, ఫిబ్రవరి 20: తాడ్వాయి మండలం చిట్యాలలో భూ తగదాల్లో శంబల భూపతి అనే వ్యక్తిపై శంబల రవి, శంబల షైపాల్, శంబల రాజయ్య, మరొకరు కలిసి రాళ్లతో, కట్టెలతో దాడి చేసినట్లు బాధితులు తెలిపారు. దీంతో భూపతి తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయమై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ దాడికి పాల్పడిన నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ముగిసిన 'లఖ్‌పతీ దీదీ' శిక్షణ


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీఎం రాజేందర్

నిజాంసాగర్, ఫిబ్రవరి 20: మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనంలో నిజాంసాగర్, ఎల్లారెడ్డి మండలాలకు చెందిన వీవోఎలకు లఖ్ పతీ దీదీపై శిక్షణ ఇచ్చారు. మంగళవారం రెండవ రోజు డీపీఎం వకుల, నిజాంసాగర్ ఏపీఎం నారాయణ గౌడ్, రాజేందర్, ప్రసన్న రాణిలు పలు అంశాలపై వివరించారు. సంఘాలలో ఉండే సభ్యులకు రుణాలు అందించడం, రికవరీ చేయడం, ఖాతాల నిర్వహణతో పాటు ప్రతి నెలా సమావేశాలు ఏర్పాటు చేయడం, సభ్యుల వివరాలు ఆన్‌లైన్ నమోదు చేయడం, రుణాలను సభ్యులు ఏ విధంగా రెట్టింపు చేసుకోవాలని అనే అంశాలపై శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. కార్యక్రమంలో సీసీలు, వీవోఎలు, అకౌంటెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సంఘం కార్యకర్తలకు శిక్షణ

భిక్కనూరు: మండల కేంద్రంలోని సమాఖ్య కార్యాలయంలో లక్‌పతి దీదీ కార్యక్రమంపై గ్రామసంఘం కార్యకర్తలకు మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎం సుధాకర్ మాట్లాడుతూ మండలంలోని 55 గ్రామసంఘాల సభ్యుల విజయగాథ పార్మట్‌లను పూర్తి చేయడం, ఈ సంవత్సరం నిర్ణయించుకున్న గ్రామసంఘానికి 80మంది చొప్పున లక్‌పతి దీదీల డాటాను మొబైల్‌లో ఎంట్రీ చేసే పద్ధతి, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీర్కూర్ ఏపీఎం గంగాధర్, భిక్కనూరు ఏపీఎం శ్రీనివాస్, సీసీలు, సిబ్బంది, గ్రామసంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనుల ప్రారంభం

రామారెడ్డి,ఫిబ్రవరి 20:రామారెడ్డి మండలంలోని అన్నారం,స్కూల్ తండా గ్రామాల్లో మంగళవారం సీసీరోడ్డు పనులను జడ్పీటీసీ నారెడ్డిమోహన్‌రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నారం గ్రామంలో రూ.20లక్షలు,స్కూల్ తండాలో రూ.10 లక్షల సీసీరోడ్డు పనులను చేస్తున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రెడ్డి, సల్మాన్, లక్ష్మీరాజం, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గానుగ గడువు పొడిగింపు

నిజాంసాగర్, ఫిబ్రవరి 20: మండలంలోని మాగి గాయత్రీ చక్కెర పరిశ్రమలో గానుగ గడువు పొడిగించినట్లు వైస్ ప్రెసిడెంట్ వేణు గోపాల్, కేన్ మేనేజర్ వెంగళ్‌రెడ్డిలు తెలిపారు. ఈ నెల 25 వరకు గానుగ గడువు పొడగించామన్నారు. 23న గానుగను మూసి వేస్తున్నట్లు గతంలో ప్రకటించామని, రైతుల కోరిక మేరకు 25వ తేదీ వరకు పొడగించామని, రైతులు చెరుకును ఫ్యాక్టరీకి తీసుకుని వచ్చి పర్మిట్లు పొందాలని కోరారు.

ఎస్సై, ఎంపీడీవోలకు భగవద్గీత అందజేత

బీర్కూర్, ఫిబ్రవరి 20 : బీర్కూర్ మండలానికి ఇటీవల కొత్తగా వచ్చిన ఎస్సై, ఎంపీడీవోలను మంగళవారం బీజేపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్సై రాజశేఖర్, ఎంపీడీవో భారతిలను సన్మానించి వారికి భగవద్గీతలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ఇంచార్జి, జిల్లా కార్యవర్గ సభ్యులు నాగేళ్ళ సాయి కిరణ్, బీజేపీ నాయకులు హన్మాండ్లు, బొంతల శ్రీనివాస్, యోగేష్, సత్యనారాయణ, ప్రవీణ్, బసవయ్య, కార్యకర్తలు శ్రీకాంత్, గజేందర్, సంపత్ ఉన్నారు.

డీఎస్పీని కలిసిన కాంగ్రెస్ నాయకులు

బీర్కూర్, ఫిబ్రవరి 20: బాన్స్‌వాడ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణను మంగళవారం బీర్కూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిశారు. డీఎస్పీ కి పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీర్కూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధ్యక్షుడు శంకర్, డిసిసి కార్యదర్శి కాంత్ రెడ్డి, బసవరాజు, కమలాకర్ రెడ్డి, ఇక్బాల్, తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 20: మండలంలోని మాల్తుమ్మెద శివారులోని పటేల్ చెరువు వద్ద మంగళవారం పేకాట ఆడుతున్న 9 మందిని పట్టుకున్నట్లు స్థానిక ఎస్సై రాజు తెలిపారు. పటేల్ చెరువు వద్ద పేకాట ఆడుతున్నట్లు తమకు సమాచారం అందడంతో పేకాట స్థావరంపై దాడి చేసి పేకాటరాయుళ్లను పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. వారి వద్ద నుంచి రూ.8230, నాలుగు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పేకాట రాయుళ్లపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.


రోహిదాస్ మహరాజ్ జయంతి ఉత్సవంలో పాల్గొన్న గ్రామస్థులు

కొడిచిరలో రోహిదాస్ మహరాజ్ జయంతి

మద్నూర్, ఫిబ్రవరి 20: మండలంలోని కొడిచిర గ్రామంలో సంత్ రోహిదాస్ మహరాజ్ జయంతి వేడుకల్లో భక్తులు పాల్గొని జయంతిని జరుపుకున్నారు. మంగళవారం ధర్మ జాగరణ ఆధ్వర్యంలో సంత్ రోహిదాస్ మహరాజ్ జయంతిని పురస్కరించుకుని గ్రామంలో భజన, కీర్తనలు జరిపి ర్యాలీ నిర్వహించారు. ఆయన సేవలను ధర్మ జాగరణ నాయకులు గంగాధర్ భక్తులకు వివరించారు. మహరాజ్ మోచి కులంలో పుట్టినా ప్రతిష్టాత్మకంగా నలుగురి కోసం పనిచేశారని, ఆయన అడుగు జాడల్లో నడుచుకోవాలన్నారు.

డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన నాగేశ్వర్‌రావు

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 20: కామారెడ్డి డీఎస్పీగా మంగళవారం నాగేశ్వర్‌రావు బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన డీఎస్పీ ప్రకాష్ మంచిర్యాలకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుస్టేషన్‌లలోని అధికారులను సమన్వయ పరుస్తు శాంతి భద్రతలను కాపాడుతానని తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 20: కామారెడ్డి మున్సిపల్ వాటర్స్‌వర్క్స్ నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షునిగా రాజనర్సు ప్రధాన కార్యదర్శిగా ప్రభాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శంకర్,ఉపాధ్యక్షులుగా జనార్దన్, గంగాధర్, నాగరాజు, రాజు, కృష్ణ, కోశాధికారిగా నర్సింలు, జెయింట్ సెక్రటరీగా అబ్బాస్ మీసాల రవి, భూలక్ష్మీ, శ్రీనివాస్, సాయిలు, గౌరవ అధ్యక్షునిగా చంద్రశేఖర్ తదితరులతో కూడిన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు.

శ్మశాన వాటిక కబ్జా

తాడ్వాయి, ఫిబ్రవరి 20: మండలం బ్రహ్మాజీవాడి శివారులోని శ్మశాన వాటిక కబ్జాకు గురవుతుందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన శంకర్‌రావు అనే వ్యక్తి శ్మశాన వాటిక స్థలాన్ని కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. శ్మశానవాటిక పక్కన ఉన్న స్థలంలోని బండరాళ్లను తొలగిస్తు కబ్జాకు పాల్పడుతున్నట్లు తెలిపారు


సమావేశంలో మాట్లాడుతున్న బాలసాహితీ వేత్త డాక్టర్ వీఆర్ శర్మ

విద్యార్థులకు సాహితీ సృజన కార్యక్రమం

మాచారెడ్డి, ఫిబ్రవరి 20: పిల్లలందరికి స్వేచ్ఛనిస్తే మంచి కథలు చెప్పడంతో పాటు రాయగలరని బాల సాహితీవేత్త డాక్టర్ వీఆర్ శర్మ తెలిపారు. మంగళవారం మండలంలోని చుక్కాపూర్ ఉన్నత పాఠశాలలో సాహితీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలందరు సహజంగా వివిధ నైపుణ్యాలను కలిగి ఉంటారని, వాటన్నింటిని వెలికి తీయడమే మన పనిగా ఉండాలని అన్నారు. పిల్లలందరికి భాష, కథలు, పాటలు, విషయాన్ని వివరించడం తెలుసునని మనం చేయాల్సిందలా పిల్లలందరికీ అనుకులమైన వాతావరణాన్ని సమకుర్చాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ నాయకులురమణ, అనిల్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మన్‌సింగ్, దేవిచంద్, నరేష్, నరేందర్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన దేవీ విగ్రహాల ప్రతిష్ఠాపన


ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

దోమకొండ, ఫిబ్రవరి 20: దోమకొండలోని శ్రీనల్ల మారెమ్మదేవి, ముత్యాలమ్మ దేవి నూతన విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం అగ్నిముఖం, అగ్నిప్రతిష్ఠాపన, సర్వదేవతా పూజలు, హోమాలు, నూతన విగ్రహాలకు జలాధివాసం, క్షీరాధివాసం, ధాన్యధివాసం, చతుర్వేద స్వస్తి తదితర పూజలు నిర్వహించారు. జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ శంకర్, శ్రీనివాస్, కాంగ్రెస్ అధ్యక్షుడు సీతారాం మధు, సీనియర్ నాయకులు గోపాల్‌రెడ్డి, గోసంగి సంఘం నాయకులు పుల్లయ్య, పోశెట్టి, రాజేశం, శ్యాం, రాజేందర్, లక్ష్మీపతి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు నూతన సొసైటీ గోదాం ప్రారంభం

బిచ్కుంద, ఫిబ్రవరి 20: మండల కేంద్రంలోని సొసైటీ ఆవరణలో 36 లక్షల సొసైటీ నిధులతో నూతనంగా నిర్మాణమైన ఐదు లక్షల మెట్రిక్ టన్నుల గోదాం బుధవారం ప్రారంభం చేయనున్నట్లు సొసైటీ చైర్మన్ బాలు తెలిపారు. ఈ ప్రారంభోత్సవానికి ఎంపీ, ఎమ్మెల్యేలతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు కూడా హాజరువుతారని సొసైటీ పరిధిలోని గ్రామాల రైతులందరూ సకాలంలో హాజరై ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయగలరని కోరారు.

టీవీవీపీకి స్టాఫ్ నర్సుల కేటాయింపు

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 20: జిల్లాలోని వైద్యవిధాన పరిషత్ (టీవీవీపీ) నూతన స్టాఫ్‌నర్సులను 53 మందిని కేటాయించారు. ఇందులో బాన్సువాడ ఎంసీహెచ్‌కు 16, ఏరియా ఆసుపత్రికి 8, ఎల్లారెడ్డి ఏరియా ఆసుపత్రికి 18, బిచ్కుంద ఏరియా ఆసుపత్రికి 2, దోమకొండ సీహెచ్‌సీ 6, మద్నూర్ సీహెచ్‌సీ 1, పిట్లం సీహెచ్‌సీ 4, అలాగే మెడికల్ కళాశాలకు 203 మంది కేటాయించగా 202 మంది రిపోర్టు చేసి విధుల్లో చేరారు.

వాహనాల తనిఖీ


నసురుల్లాబాద్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై

నసురుల్లాబాద్, ఫిబ్రవరి 20: మండల కేంద్రంలోని గండి ప్రాంతంలో మంగళవారం నసురుల్లాబాద్ ఎస్ఐ లావణ్య ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా ఎస్ఐ లావణ్య మాట్లాడుతూ ధ్రువ పత్రాలు లేని వాహనాల యజమానులకు ఆన్‌లైన్ ద్వారా జరిమానాలు వేయడం జరిగిందన్నారు. వాహనదారులు రహదారిపై వెళ్లే సమయంలో ద్విచక్ర వాహనదారులు, హెల్మెట్ లైసెన్స్ వెహికల్ ధ్రువపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని అలాగే కార్ డ్రైవింగ్ చేసే వారు సీట్ బెల్ట్ ధరించాలని వాహన దారులకు సూచించారు. ఈ తనిఖీలో ఏఎస్ఐ అబిబ్ బేగ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నిజాంసాగర్: మండల కేంద్రంలో మంజీరా వంతెన సమీపంలో మంగళవారం ఏఎస్సై రాజేశ్వర్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్ లేని వాహనాలకు, సక్రమంగా నెంబర్లు లేని వాహనాలు మొత్తం 20 వాహనాలకు రూ. 2600 జరిమానా విధించినట్లు తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపిస్తున్న ఒకరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
దర్శన్	హనుమాన్
శాంతి	ఊరు పేరు బైరవకొన
ప్రియా 70	ఈగల్
ప్రియా 35	రాజధాని ఫైల్స్

బాన్సువాడ	
మహేశ్వరి	ఊరు పేరు బైరవకోన
వెంకటేశ్వర	లాల్ సలామ్

చికెన్ ధరలు



రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

